# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆయుర్వేద చికిత్స, ఔషధాలు ప్రజలందరికీ ప్రయోజనం చేకూరుస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ ఇజ్రాయిల్ చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఆ దేశ ప్రధాని బెంజిమన్ నెతన్యాహుతో కొద్ది సేపటి క్రితం సమావేశమయ్యారు.
- ❖ రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునే పరిస్థితి నుండి ఎగుమతి చేసే స్థాయికి భారత్ అభివృద్ధి చెందిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- ❖ పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద ఇప్పటివరకు 28 లక్షలకు పైగా విద్యుత్ వాహనాల అమ్మకాలు జరిగాయని కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆయుర్వేదం.. యోగా తదితర ఆయుష్ వ్యవస్థలు.. వ్యాధుల చికిత్సకే పరిమితం కాదని, ఇవి సమగ్ర ఆరోగ్య నిర్వహణ శాస్త్రాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ.. అఖిల భారత ఆయుర్వేద కాంగ్రెస్ సహకారంతో మహారాష్ట్రలోని బుల్ధానా జిల్లా షెగావ్‌లో నిర్వహించిన 4 రోజుల జాతీయ ఆరోగ్య ఉత్సవాన్ని ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్రపతి ఆరోగ్యం ప్రాముఖ్యతను వివరిస్తూ... వ్యాధి నివారణ కంటే ముందు జాగ్రత్త ఉత్తమం అనేది విశ్వవ్యాప్తంగా ఆమోదించబడిన వాస్తవమని పేర్కొన్నారు. వ్యాధిని నివారించడం వ్యక్తికి ప్రయోజనకరమే కాక, దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై భారాన్ని కూడా తగ్గిస్తుందని.. అందుకే క్రమం తప్పకుండా వ్యాయామం, సరైన ఆహారం, సమతుల్య జీవనశైలి వంటివి ఆవశ్యకమని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఒత్తిడి లేని, ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం యోగాను అవలంబిస్తున్నారన్న రాష్ట్రపతి.. ఆయుర్వేద చికిత్స, ఔషధాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటన నిమిత్తం ఈ మధ్యాహ్నం టెల్ అవీవ్ నగరానికి చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన సతీమణి సారా నెతన్యాహు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయంలో తనకు లభించిన గౌరవానికి నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొనడంతో పాటు.. భారత్-ఇజ్రాయెల్ స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు తాను ఎదురుచూస్తున్నానని ప్రధానమంత్రి సామాజిక మధ్యమం పోస్ట్‌లో పేర్కొన్నారు. టెల్ అవీవ్‌లో నరేంద్ర మోదీ ఇజ్రాయిల్ ప్రధానమంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన జెరూసలేంకు బయలుదేరి వెళ్లారు. అక్కడ ఆయన ఇజ్రాయెల్ పార్లమెంట్ సెనెట్‌లో ప్రసంగించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునే స్థాయి నుండి తయారీ, ఎగుమతి చేసే స్థాయికి సుదీర్ఘ ప్రయాణం చేసిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలోని సౌత్ బ్లాక్‌లో ఇండియన్ ఫారిన్ సర్వీస్ ట్రైనీ అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఆత్మనిర్భర్ భారత్ కింద స్థానిక ఉత్పత్తి, ఎగుమతుల కోసం స్వదేశీ రక్షణ పరిశ్రమ సామర్థ్యాన్ని విస్తరించాలనే ప్రభుత్వ సంకల్పం సాకారమైందన్నారు. దీనికి భారత దౌత్యవేత్తలు కీలక పాత్ర పోషించారని చెప్పారు. ప్రతి సంస్కృతి నుండి కొత్త ఆలోచనలను స్వీకరించి.. దేశ నాగరిక జ్ఞానం, విలువలను తమతో తీసుకెళ్లాలని అధికారులను ఈ సందర్భంగా కోరారు. భారతదేశ పురోభివృద్ధిని ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తూ.. భారత్ నాయకత్వాన్ని ఆశిస్తున్నాయని రక్షణ మంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద ఇప్పటివరకు 28 లక్షలకు పైగా విద్యుత్ వాహనాల అమ్మకాలు పూర్తయ్యాయని కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి హెచ్ డీ కుమార స్వామి తెలిపారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ.. ఎలక్ట్రిక్ వాహనాల జాతీయ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. ప్రధాన నగరాల్లో 14 వేలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేయడంతో ప్రజా రవాణా విద్యుదీకరణ ఊపందుకుందని పేర్కొన్నారు. అమ్ముడైన వాహనాలలో 20 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, దాదాపు 3 లక్షల ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లు ఉన్నాయని చెప్పారు. ఎలక్ట్రిక్ మొబిలిటీ వాతావరణానికి సంబంధించిన చొరవ మాత్రమే కాదని, పారిశ్రామిక వ్యూహమని, ప్రస్తుత సవాళ్లను పరిష్కరించే దిశగా భవిష్యత్ పరిశ్రమలను నిర్మించడం లక్ష్యంగా ఒక సాంకేతిక ముందడుగు అని కుమారస్వామి వివరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పూసా కృషి విజ్ఞాన మేళాను న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఎరువుల లభ్యతను బలోపేతం చేస్తోందని, నకిలీ పురుగుమందుల అమ్మకాలను అరికట్టిందని తెలిపారు. రైతుల రుణాలను క్రమబద్ధీకరించడానికి త్వరలో రైతు ఐడిని ప్రవేశపెట్టనుందని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు దాదాపు లక్షా 92 వేల కోట్ల రూపాయలు పంపిణీ చేయబడ్డాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ ప్రయత్నాలు జరగాలన్న ఆయన... కృషి విజ్ఞాన మేళా వ్యవసాయానికి మహాకుంభ మేళాగా మారాలని, వ్యవసాయ ఆధారిత ఆవిష్కరణలతో పాటు రైతులు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి ఈ మేళా వీలు కల్పించాలని శివరాజ్ సింగ్ చౌహాన్ ఆకాంక్షించారు.

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత రణ్ భూమి దర్శన్ (D2D) యాత్ర ముగింపు వేడుకను న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈరోజు ప్రారంభించారు. 22 రోజుల పాటు జరిగిన దాదాపు 3 వేల 400 కిలోమీటర్ల దూర ప్రయాణం ముగింపును సూచిస్తూ.. ఈ వేడుక జరిగింది. ఈ నెల 3న ద్వారక నుండి ప్రారంభమైన ఈ యాత్రకు భారత సైన్యం, నావికాదళం, సరిహద్దు భద్రతా దళాలు సంయుక్తంగా నాయకత్వం వహించాయి. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని కీలక ప్రదేశాలను దాటిన ఈ యాత్ర దేశ యుద్ధ వీరులకు నివాళులర్పిస్తూ.. భారతదేశ ఘనమైన సైనిక వారసత్వాన్ని చాటి చెప్పింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోహరించే కేంద్ర సాయుధ పోలీసు దళాల (CAPF) సిబ్బందికి కేటాయించిన వాహనాలపై GPS ట్రాకర్లను అమర్చాలని భారత ఎన్నికల సంఘం (ECI) నిర్ణయించింది. CAPF సిబ్బంది వాహనాల మోహరింపునకు సంబంధించి గత ఎన్నికలలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఈ చర్యలు చేపట్టింది. ECI నియమించిన కేంద్ర పరిశీలకులు CAPF సిబ్బంది కదలికలను పర్యవేక్షించడానికి GPS ట్రాకింగ్ వ్యవస్థ వీలు కల్పిస్తుందని పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల కార్యాలయం తెలిపింది. తొలిదశలో 240 కంపెనీల CAPF సిబ్బందిని వచ్చే నెల 1వ తేదీన, రెండవ దశలో మార్చి 10వ తేదీ నుండి 240 కంపెనీల సిబ్బంది మోహరించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పెరుగుతున్న ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో స్థిరత్వాన్ని కాపాడుకోవడం, ఆయుధ పోటీని నిరోధించడం అత్యవసరమని భారతదేశం స్పష్టం చేసింది. జెనీవాలో జరిగిన 2026 ఉన్నత స్థాయి నిరాయుధీకరణ సదస్సులో భారత్ తరుపున విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా భారతదేశం విశ్వసనీయమైన కనీస నిరోధక వ్యవస్థను నిర్వహించడానికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. సైనిక రంగంలో కృత్రిమ మేధ (AI)ను బాధ్యతాయుతంగా ఉపయోగించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. ప్రమాదాలను తగ్గించడంతో పాటు.. అంతర్జాతీయ మానవతా చట్టానికి అనుగుణంగా ఉండేలా చూసుకోవడానికి AI వాడకంలో పర్యవేక్షణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుండి 4 రోజుల పాటు జార్ఖండ్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా కద్మాలోని శ్రీ జగన్నాథ స్వామి ఆలయానికి శంకుస్థాపన చేయడంతో పాటు జంషెడ్‌పూర్‌లో మణిపాల్ టాటా మెడికల్ కాలేజీ భవనానికి రాష్ట్రపతి భూమిపూజ నిర్వహిస్తారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య ఈరోజు ఒక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశాయి. దేశ సాంస్కృతిక, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ కోసం సమగ్ర వ్యూహాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ ఒప్పందం జరిగింది. సంస్కృతిని ఆర్థిక శ్రేయస్సుకు పునాదిగా మార్చే దిశగా ఈ ఒప్పందం ఒక ముఖ్యమైన అడుగు అని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సామాజిక మాధ్యమం పోస్ట్‌లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఐసిసి పురుషుల టీ-20 ప్రపంచ కప్ సూపర్- 8 గ్రూప్-2 విభాగంలో భాగంగా కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికగా శ్రీలంక, న్యూజిలాండ్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. మొదట బ్యాటింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ 17 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 116 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = =